12.

# దైవము సర్వవ్యాపి

ప్రేమస్వరూపులారా!

దైవము లేని స్థానము కాని, దైవము కాని రూపము కాని మరొకటి లేదు.

**అడవిలోననున్న ఆకాశమున నున్న**
**పట్టణమున నున్న పల్లెనున్న**
**గుట్టమీద నున్న నట్టేటనున్నను**
**మదిని సాయి నిన్ను మరువడెపుడు.**

ఈనాటి మానవుడు ఆత్మజ్ఞాన నిమిత్తమై అనేక విధములైనట్టి సాధనలు సల్పుతున్నాడు. కాని యిది జ్ఞానము కాదు. ఇది అజ్ఞానమనే చెప్పవచ్చును. ఎన్ని గ్రంథములు చదివినప్పటికిని, ఎన్ని విధములైనట్టి సాధనలు సల్పినప్పటికిని ఎందరి గుణములు రప్పించినప్పటికిని, కడపటికి తనకు తాను గుర్తించుకోలేనట్టి వాడు ఈ జ్ఞానాన్ని పొందలేడు. ఈనాటి మానవుడు తనయందున్నట్టి మానవత్వాన్ని గుర్తించుకోలేనట్టివాడు, దైవాన్ని ఏరీతిగా గుర్తించగలడు? మొట్టమొదట తనయందున్న మానవత్వాన్ని గుర్తించినప్పుడే, దివ్యత్వాన్ని కూడ గుర్తించే అర్హత వస్తుంది. ఇట్టి ఆత్మ జ్ఞానాన్ని పొందగోరి, బుద్ధుడు అనేక విధములైనట్టి సాధనలు సల్పుతూ వచ్చాడు. ప్రపంచములో నున్నటువంటి ఆత్మజ్ఞాన గ్రంథములన్నియు చదివాడు. మహనీయులందరినీ దర్శించాడు. తీర్థయాత్రలన్నీ సలిపాడు కాని కట్టకడపటికి తనకే మాత్రము తృప్తి కలుగలేదు. దీనికి కారణమేమిటి? బాహ్యమైన, లౌకికమైన, ప్రాకృతమైన యీ సాధనలన్నీ కేవలము ఇవి ఒక నెగటివ్‌తో చేరినట్టివి. కాన మానవునకు ప్రసాదించినటువంటి ఐదు ఇంద్రియములు మనము పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టాలి. భగవంతుడు అనుగ్రహించి నటువంటి ఈ ఐదు ఇంద్రియములను మనము దుర్వినియోగం చేసుకుంటూ, దుర్మార్గములో ప్రవేశపెట్టి, దైవము కావాలంటే ఏ రీతిగా

srisathyasaivachanamrutam

లభ్యమవుతాడు? ఈనాటి మానవుడు సలపవలసినట్టి సాధనలు, ఐదు ఇంద్రియములు సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టి, సాధించి, శోధించి దివ్యత్వాన్ని పొందాలి.

కనుకనే మొట్టమొదట బుద్ధుడు 'సమ్మక్ దృష్టి' అన్నాడు. అనగా ఏమిటి? కన్నులున్నాయి కదా అని యిష్టమొచ్చినట్లు, యిష్టమొచ్చిన పదార్థములను, ఇష్టమొచ్చిన వ్యక్తులను చూడకూడదు. పవిత్రమైనట్టి దృష్టినే మనము అభివృద్ధి పరచుకోవాలి. See no evil, see what is good, ఏది పవిత్రమైనట్టిది? దివ్యమైన, భవ్యమైన మంగళమైనట్టి ఒక దివ్యత్వంయొక్క తత్త్వాన్ని మాత్రమే పవిత్ర దృష్టి అని చెప్పాలి. హృదయమునుండి ఆవిర్భవించినట్టి దృష్టియే పవిత్రమైన దృష్టి. కన్నులనుంచి ఆవిర్భవించిన దృష్టి యిది కేవలము సరియైన దృష్టి కాదు. ఈ చర్మచక్షువులద్వారా చూచిన దృష్టి యిది 'నెగటివ్'. హృదయంద్వారా చూచిన దృష్టియే 'పాజిటివ్'. ఈ హృదయంనుంచి వచ్చిన దృష్టిని, యీ చర్మచక్షువులద్వారా చూచినప్పుడే నెగెటివ్ పాజిటివ్ రెండూ చేరి పవిత్రమైనట్టి ఒక వెలుగును అందించగలవు. కనుక మనము కన్నులచేత పవిత్రమైనట్టి దృష్టిని అభివృద్ధిపరచుకోవాలి. దుర్భావములు, దురుద్దేశ్యములు, దుశ్చర్యలు, దుశ్చింతనలు యివే మన దృష్టిని అపవిత్రం చేస్తున్నాయి. కాని యీనాటి మానవుడు పాపభీతి కాని, దైవప్రీతి కాని, సంఘనీతి కాని ఏమాత్రము అభివృద్ధి పరచుకోవడం లేదు. కనుకనే యీనాటి దేశము యీ విధమైనట్టి దురవస్థలకు గురి అవుతూ వస్తుంది.

**పాపభీతి లేని పామరత్వముబట్టి**
**దైవప్రీతి లేనిదారి పట్టి**
**మానవత్వమణగె మానవులందున**
**విశ్వశాంతికిదియె విప్లవంబు.**

కనుక మానవునకు భగవంతుడనుగ్రహించినట్టి, యీ పంచేంద్రియములను సక్రమమైన మార్గములో, సరియైనట్టి స్థితిలోపల వినియోగించుకోవాలి. ఈ సమ్యక్‌దృష్టిచేత 'సమ్యక్‌భావము' ఏర్పడుతుంది. ఈ సమ్యక్ భావముచేత, 'సమ్యక్‌కర్మ'ను ఆచరిస్తాడు. ఈ కర్మలతోనే మానవునకు ప్రధానమైనట్టి ఒక అందము. హృదయమునుంచి ఆవిర్భవించినట్టి

sri sathyasai vachanamrutam

భావము. వాక్కుద్వారా వెలువడే వాక్యములు, క్రియలద్వారా వీటిని అనుభవించాలి. దీనినే 'త్రికరణశుద్ధి' అన్నారు. దీనినే the proper study of mankind is man. హృదయ సంకల్పము, నేత్రములయొక్క దృష్టి, చేతలయొక్క కర్మ మూడింటియొక్క ఏకత్వమే నిజమైనట్టి పూర్ణత్వము. కనుక ఎన్ని చదువవలసినట్టి గ్రంథములు చదివినప్పటికిని, ఎందరు పెద్దలను దర్శించినప్పటికిని, ఎన్ని విధములైన సాధనలు సల్పినప్పటికిని, సమ్యక్ దృష్టి లేకుండా ఉండిన యివన్నీ కూడను నిరుపయోగములే. ఇట్టి పరమ సత్యాన్ని గుర్తించినట్టి బుద్ధుడే మొట్టమొదట సాధకునకు సమ్యక్‌దృష్టి అత్యవసరము అని చెప్పాడు.

**ఆధ్యాత్మిక శోధన ద్వారా హృదయం పవిత్రం అవుతుంది**

మొన్న దిలిప్‌చంద్ చెప్పాడు. 'Help ever, hurt never.' నీకు సాధ్యమైనంతవరకుకు యితరులకు సాయము చేయడానికి ప్రయత్నించు. ఎవరినీ బాధపెట్టడానికి పూనుకోవద్దు. కేవలము కర్మచేతనే కాదు, కేవలం వాక్కు చేతనేకాదు, లేక పనులచేతనే కాదు, లేక హృదయంచేతనే కాదు, సర్వవిధములకూడను యితరులకు సహాయము చేసే ప్రయత్నములో మనం పూనుకోవాలి. ఒకవేళ నీకు సహాయము చేయడానికి సాధ్యం కాకుండిన, కీడు మాత్రం చేయకు. అదియే గొప్ప 'హెల్ప్'. ఇలాంటి భావాల్ని మనయందు ఆవిర్భవింప చేసుకుని, ఇంత చక్కనైనట్టి దైవత్వాన్ని విశ్వసించి, పవిత్రమైనట్టి ప్రకృతిని సార్థకం గావించుకోవాలి. ఎప్పుడు మనము సమ్యక్‌దృష్టిని అభివృద్ధి పరచుకుంటామో, 'సమ్యక్‌వాక్' ఆవిర్భవిస్తుంది. మొట్టమొదట మనము దృష్టి అభివృద్ధి పరచుకున్న తర్వాతనే హృదయం లోపలనుంచికూడను పవిత్రమైనట్టి వాక్కు వెలువడుతుంది. హృదయంనుంచి వచ్చే వాక్కులే నిజమైన వాక్కులు. నాలుకనుండి వచ్చేటటువంటి వాక్కులు సత్యవాక్కులు కావు. లేక గొంతునుంచి వచ్చేటటువంటి వాక్కులు నిజమైనవి కావు. ఇది హృదయంనుంచి ఆవిర్భవించాలి. ఈ హృదయం నిరంతరము కూడను దయచేత నిండియుండేటు వంటిది. దానినే హృత్+దయ=హృదయం. కాబట్టి హృదయమనేటువంటిది కేవలం దయచేత నింపుకోవాలి. అప్పుడు సమ్యక్‌దృష్టి, సమ్యక్‌వాక్కు, సమ్యక్ శ్రవణం, సమ్యక్‌కర్మ అన్నికూడను సమ్యక్‌దృష్టిగా ఏర్పడుతుంది. కనుక ఏ వాక్కు చేసినప్పటికిని, ఏ దృష్టి

srisathyasaivachanamrutam

చూచినప్పటికిని, ఇది హృదయం నుంచి ఆవిర్భవిస్తున్నదా? లేక నాయొక్క నేత్రములనుండి వచ్చినదా? అనేటువంటి పరీక్ష మనం చేయాలి. ఇదియే ఆధ్యాత్మిక పరిశోధన, ఇదియే ఆధ్యాత్మిక పరిశీలన. ఈ పరిశోధన, పరిశీలన ద్వారా హృదయాన్ని పవిత్రము గావించుకోవడానికి తగిన కృషి చేయాలి.

**జననమరణాలు సహజమైనవి**

ఒకానొక సమయములో బుద్ధుడు తన పినతండ్రియైనట్టి గౌతముని కుమారుడైనట్టి ఆనందుని చూచాడు. బుద్ధుడు తనయొక్క స్థితిని నిర్వాణక స్థితిని తెప్పించుకున్నాడు. ఆ స్థితిని గుర్తించి, యీ ఆనందుడు  కంటినీరు కార్చాడు. బుద్ధుడు దేహాన్ని వదలుతున్నాడు. మా కింక గతి ఏమిటి? మా కింక మార్గమేమిటి? అని విచారము చేస్తూ వచ్చాడు. బుద్ధుడు ఆనందుని దగ్గరకు పిలచి, 'ఆనందా! నీవు విచారము చేయవలసినట్టి సమయము కాదు. నేను నిర్వాణమునకు అత్యంత సమీపంలో ఉన్నాను. నీవు కూడ యిట్టి నిర్వాణమునకు సమీపము కమ్ము. లోకములో మరణించినట్టి వారిని చూచి, బ్రతికినట్టి వారు అనేక దుఃఖములననుభవిస్తూ ఉంటారు. కాని ఎవరు మరణించిన వారు? ఇవాళ దుఃఖించినట్టి వారు కూడను రేపటికి మరణించవచ్చు. ఎప్పుడు పుట్టుక ఉన్నదో అప్పుడు చావుకూడ ఉన్నది.

**పరమాత్మ ఒక్కడే శాశ్వతుడు**

**చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు**
**ఆదిమధ్యాంత రహితుడనాదివాడు**
**తాను పుట్టక చావక చంపబడక**
**ఆత్మరూపుడై అంతట వెలసియుండు.**

కనుకనే, ఒక దైవమునకు తప్ప సాధారణ మానవులకు పుటుట్ట, చాచ్చుట రెండు కూడను సహజమైనట్టివి. ఇవి రెండు కూడను తప్పవు. కనుక ఎందుకేడుస్తున్నావు? నీవు కూడ యిట్టి స్థితిని పొందడానికి ప్రయత్నించు. అన్నింటికినీ భగవంతుడే మూలాధారము. ఆ దైవము సర్వత్రా ఉన్నాడు.

**సర్వతః పాణిపాదం తత్సర్వతో క్షిశిరోముఖమ్**

srisathyasaivachanamrutam

**సర్వతః శృతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి.**

అన్నది. దీనినే వేదమందు, 'సహస్రశీర్షాపురుషః సహస్రాక్ష సహస్రపాత్'. కేవలము వేల శిరస్సులు కలిగినట్టి వాడు కాదు. ఈ వేల శిరస్సులన్నీ కూడను దైవముయొక్క శిరస్సులే. కనుకనే ప్రతి మానవుడు కూడను దైవస్వరూపుడే. కనుకనే 'ఈశ్వరః సర్వ భూతానాం' అన్నారు. 'ఈశావాస్యమిదం సర్వం'. కనుకనే ప్రతి మానవుడు కూడను దైవస్వరూపునిగా విశ్వసించాలి. కేవలము దేహము మాత్రమే ఆధారము చేసుకొని, నేను మానవుడను, మానవుడను అని నీవు భ్రమిస్తూ ఉన్నావు. కాని ఈ దేహము మానవదేహమే కాని, నీవు భగవత్స్వరూపుడవే. నీవు మూడు రూపములు కలిగినట్టి మానవుడవు. You are not one person, but three. The one you think you are is the physical body. The one others think you are, mental body. The one you really are. That is Atma. ఈ మూడు రూపములతో చేరినట్టిదే నీ యొక్క మానవత్వం. కనుకనే మనం ఏ విధముగా ప్రార్థన చేయాలి?

**త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రం చ త్రియాయుధమ్**
**త్రిజన్మ పాప సంహారం ఏకబిల్వం శివార్పణమ్.**

త్రిగుణం త్రిదళాకారం. సాత్త్విక రూపంలో గుణములు గలయట్టి మానవుడు, త్రిదళాకారం అదే యీ దేహము, మనసు, ఆత్మ. ఈ త్రిమూర్తి స్వరూపమైనట్టి మానవత్వాన్ని శివార్పణం కావించాలి. అనగా ఏమిటి? సర్వకర్మ భగవత్ప్రీత్యర్థము.

కనుక మొట్టమొదట మనలో యీయొక్క పవిత్రమైనట్టి భావములు ఆవిర్భావించాలంటే సమ్యక్‌దృష్టి అత్యవసరం దృష్టి సరియైనది లేకపోతే, మనయొక్క చర్యలన్నీ సరియైనట్టివి కాకపోతాయి. టాంక్‌లో మంచి నీరు నిండినప్పుడే టాప్‌లో మనకు మంచి నీరు లభిస్తుంది. టాంక్‌లో చెడునీరు నింపితే, టాప్‌లో అంతా చెడునీరే వస్తుంది. కనుక నీ హృదయమే టాంక్. మన సమ్యక్‌దృష్టి, సమ్యక్‌శ్రవణం, సమ్యక్‌వాక్కు, సమ్యక్‌కర్మ యివన్నీకూడను టాప్స్. ఈ పంచభూతములు కూడను పంచ టాప్స్. కనుక

srisathyasaivachanamrutam

హృదయంలో నీవు పవిత్రమైన భావాలను నింపితే, అప్పుడు సహజంగా సమ్యక్‌దృష్టి, సమ్యక్‌శ్రవణం, సమ్యక్‌భావము, సమ్యక్‌కర్మ, సమ్యక్‌కీర్తన యీ ఐదు కూడను పవిత్రం అవుతాయి.

**పంచేంద్రియాలను సరియైన రీతిలో ఉపయోగించాలి**

కనుక యీనాటి మానవుడు హృదయాన్ని ఏమాత్రము లెక్కచేయడం లేదు. నోరు ఉంది కదాయని యిష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడు. దానివలనే అనేకమైనట్టి బాధలకు గురవుతున్నాడు. కన్నులున్నవి కదాయని యిష్టమొచ్చినట్లుగా చూస్తున్నాడు. కనుకనే యీ చెడుదృష్టి వల్ల అనేకమైనట్టి చెడు సంకల్పాలు వస్తున్నాయి. ఈ చెడు ఆలోచనల వల్ల చెడు క్రియలలో ప్రవేశిస్తున్నాడు. కనుక యీ చెడ్డవన్నీ కూడ మనలో ప్రవేశించడానికి మూలకారణం ఏమిటి? సమ్యక్‌దృష్టి లేకపోవడమే. సమ్యక్‌శ్రవణం లేకపోవడమే. సమ్యక్‌కర్మ లేకపోవడమే. సమ్యక్‌భావము లేకపోవడమే. సమ్యక్‌వాక్కు లేకపోవడమే. కనుకనే

**See no evil, see what is good,**
**Talk no evil, talk what is good**
**Hear no evil, hear what is good**
**Think no evil, think what is good**
**Do no evil, do what is good**
**This is the way to GOD.**

ఈ పంచదోషములను పరిహారం కావించుకునే నిమిత్తమై, పంచేంద్రియములను మనం పవిత్రం చేసుకోవాలి. నీవు జపములు, యోగములు, ధ్యానములు, యజ్ఞములు ఎన్ని చేసినప్పటికిని యీ పంచేంద్రియములలో దోషం ఉంటే, ఇవన్నీకూడను ప్రయోజనం ఉండదు. ఇవన్నీ కూడను బాహ్యమైనట్టి, ప్రకృతికి సంబంధించినట్టివే. ఈ నెగెటివ్ ఎంతకాలమైనప్పటికినీ, కొంత కాలములో నశించిపోతుంది. నెగెటివ్ ఎప్పుడూ కూడను కొంత తాత్కాలిక గౌరవం మాత్రమే తెస్తుంది. కాని పాజిటివ్ అనేది హృదయస్థానములో ఉండి, అదియే మనకు శాశ్వతమైనట్టిది. దీనినే పాజిటివ్ అన్నారు. దీనిని ఏ విధంగా

srisathyasaivachanamrutam

చెప్పింది వేదము? 'నిర్గుణం, నిరంజనం, సనాతనం, నికేతనం, నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త, నిర్మల స్వరూపిణం'. కనుక అట్టి పర్మనెంట్ అంశాలనే మనం ఆధారం చేసుకోవాలి. ఈ టెంపరెరీ అంశాలను ఆధారం చేసుకుంటే మన జీవితముకూడ టెంపరెరీ అవుతుంది. ఆత్మ శాశ్వతం. దేహం మరణించినా ఆత్మ మరణించటంలేదు. కనుక మరణించనట్టి ఆత్మనే మనం ఆధారంగా తీసుకోవాలి. ఆ ఆధారము తీసుకున్నట్టి దానిని ఒక fundamental దీనిగా తీసుకోవాలి. ఈ fundamental ఆధారం తీసుకున్నప్పుడే యీ టెంపరెరీ కూడ పవిత్రమై పోతుంది.

**పరిశోధనలన్నీ భౌతికస్థాయికే పరిమితం**

ఇప్పుడు నిజమైనట్టి ఒక తత్త్వంలో నీరు కావాలి త్రాగడానికి. ఈ నీరు నీకేవిధంగా లభిస్తుంది? ఈ నీరు చాలా ప్రధానమైనట్టిది, ప్రాణ సమాన మైనట్టిది అనుకుంటున్నాడు. కాని, ఈ నీటిని గుర్తించటానికి సైంటిస్టులు అనేక రకములైనట్టి ప్రయోగాలు చేస్తున్నారు. ఆక్సిజన్, హైడ్రోజన్ యీ రెండుకూడ చేరితే నీరు అవుతుందంటారు. ఈ రెండింటి ద్వారా నీరు సృష్టించానని గర్వపడుతున్నాడు మానవుడు. ఈ నీరు రావడానికి ఆక్సిజన్, హైడ్రోజన్ ఎవరు సృష్టించారు? అదే fundamental. అదే భగవత్ సృష్టి. ఆ భగవత్ సృష్టి ఉండటము చేతనే యీ సైంటిస్టులు అంతా కొన్ని matter టెస్టుచేసి, దానివలన సృష్టింపబడుచున్నది. కనుక ప్రతిదానియందున ఒక పర్మనెంట్ అనేది ఒక భగవత్ శక్తి ఉంటుంది. ఆ divine principle వల్ల మానవత్వంలో ఉన్నటువంటి శక్తి సామర్థ్యములు అభివృద్ధి గావించుకుంటూ వస్తున్నాడు. మానవునియందు అనంతమైనట్టి శక్తులుంటున్నాయి. దానికి ఒకటి, రెండు అని పరిమితం లేవు. అనంతము, అగమ్యము, అగోచరము, అప్రమాణము. కనుకనే వేదము ఏమని చెప్పింది? 'యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ'. మనసుతో విచారణ చేయడానికి వీలుకాదు. బుద్ధితో విచారణ చేయడానికి వీలుకాదు. ఇంజనీర్లు దీనిని పరిశోధన చేయడానికి వీలుకాదు. దీనికి అన్నింటికీ అతీతమైనది ఆత్మతత్త్వమే ప్రధానమైనట్టిది. ఆ ఆత్మ ప్రతీ ఒక్కరియందు ఉంది.

**సెన్సెస్-కాన్షస్-కాన్షియస్‌నెస్**

srisathyasaivachanamrutam

ఆ ఆత్మనే 'కాన్షియన్స్' అంటున్నారు. అయితే యీ దేహముతో పరిమితమైనట్టిదే 'కాన్షియన్స్'. కాని సర్వత్రా ఉండినట్టి ఒక దివ్యమైన చైతన్యమే కాన్షియస్‌నెస్ అన్నారు. సర్వత్రా ఉంటుంది కాన్షియస్‌నెస్. దీనినుంచి ఒక బిందువు మాదిరి తీసుకొని వాటినుండి 'కాన్షస్' అనేటి దీనికి చేర్చారు. కానీ యీ కాన్షియస్‌నెస్ నుంచి కాన్షస్. అదే సెన్సెస్. కాబట్టి మొట్టమొదట్లో ఐదు సెన్సెస్ మనము పవిత్రం గావించుకున్నప్పుడు యీ కాన్షస్ అనేది కూడ పవిత్రమై పోతుంది. ఈ కాన్షస్ అనేది పవిత్రమైనప్పుడు కాన్షియస్‌నెస్‌లో లీనమై పోతుంది. అదే విధముగానే బుద్ధుడు చెప్పిన సాధన. తన 'సెన్సెస్'ని అరికట్టుకుంటూ పోయాడు. పవిత్రమైన మార్గములో ప్రవేశపెడ్తూ పోయాడు. దివ్యమైన, భవ్యమైనట్టి నవ్యభావాలను అభివృద్ధి పరచుకున్నాడు. తద్వారానే హృదయము పవిత్రమైపోయింది. హృదయం పవిత్రం కాగానే నిర్వాణం పొందాడు. కనుక మనం చేసినట్టి సాధనలన్నీ సత్కర్మలే. ధ్యానం సత్కర్మనే. జపం సత్కర్మనే. తపం సత్కర్మనే. యోచన సత్కర్మనే. యోగం సత్కర్మనే. త్యాగం సత్కర్మనే. ఇవన్నీ సత్కర్మలు మాత్రమే కానీ, మోక్షమునకు ప్రధానముకాదు. మోక్షమునకు ప్రధానమైనట్టిది ఒక్క హృదయమే. కనుకనే నమ్మాళ్వార్ చెప్పాడు. 'చిత్తశుద్ధి ఓరుగనై పూజ సేతు నేమి'. నా చిత్త శుద్ధితో పూజ చేస్తున్నాను అన్నాడు. మనలో విశాలమైన భావాలు పెంచుకోవాలి. సంకుచితమైన భావాలు ఉండకూడదు. Expansion of Love not contraction of Love.

### మాణిక్య వాచకర్ ఆదర్శం

ఒకానొక సమయంలోపల కొందరు బజారులో నడుస్తున్నారు. వర్షము అమితంగా కురుస్తూ వచ్చింది. ఎక్కడ కూడ చోటు చిక్కలేదతనికి. ఒక చిన్న గృహము దానికి చిన్న వరండా ఉన్నాది. ఆ యింటి లోని వాళ్లు యింటి తలుపు వేసుకున్నారు. వరండా మాత్రము విడచిపెట్టారు. ఆ వరండాలో పోయి కొంత కాలు జాపి కూర్చున్నాడు పాపం. అక్కడనుండి వర్షములో పోతున్న వ్యక్తులు చూచారు. తక్షణమే ఇంకో వ్యక్తి వచ్చాడు. అయ్యా! ప్రభో! నీవు కూడ వరండాలోకి వచ్చి వర్షమునుంచి తప్పించుకో అని చెప్పాడు. మీరు పరుండారు అన్నాడు. అయ్యా! నేను కూర్చుంటాను. మనిద్దరమూ చేరి కూర్చుందాము అన్నాడు. మరి

sri sathyasai vahini amrutam

కొంత సేపటికి ఇంకో వ్యక్తి తడుచుకుంటూ వచ్చాడు. ఓ ప్రభో! నీవు కూడ యిక్కడకు రా అన్నాడు. ఎక్కడ మీ యిద్దరికి కూర్చోవడానికే స్థలం లేదే అన్నాడు. మేమిద్దరము కూర్చున్నాము. మీరు వస్తే ముగ్గురము నిల్చుకుందాము అన్నాడు. చూసారా! ఒకడు పండుకున్నట్టి స్థలములో రెండోవాడికి చోటిచ్చి కూర్చున్నారు. రెండోవాడికి చోటిచ్చి, మరి మూడోవాడికి చోటిచ్చినప్పుడు నిల్చున్నారు. ఇట్టి పరోపకార సంబంధమైనట్టి భావముతో కూడుకున్నట్టి వాడే మాణిక్ వాచకర్. ఈ మాణిక్ వాచకర్ యీ యొక్క ఆదర్శాన్ని నిరూపిస్తూ వచ్చాడు. పవిత్రమైన హృదయాలు, విశాలమైన భావాలు పెంచుకోవాలి. నేను ఒక్కడినే పండుకోవాడానికి స్థలముంది చాలులే అనుకోలేదు. అది సంకుచిత భావము, ఇంకొకరు వస్తే కూర్చుందాం తప్పులేదు. ఇంకొకరొస్తే నిల్చుకుందాం. తప్పులేదు. కనుకనే 'పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం' అన్నారు. కనుకనే భగవంతుడు యీ శరీరం నిచ్చినది దేనికోసము? 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం' అన్ని ధర్మములోపల ప్రవేశపెట్టాలి. ఎప్పుడు యీ పవిత్రభావము మనలో ఆవిర్భవిస్తుంది? సమ్యక్‌దృష్టి ద్వారానే మనకు లభిస్తుంది. ప్రతి ఒక్కరు దృష్టిని పవిత్రమైన దృష్టిగా మార్చుకోవాలి. కాకి దృష్టిగా, దుష్ట దృష్టిగా మార్చుకోకూడదు. ఏకదృష్టి, ఏదైనా మంచిదానిపైన దృష్టి పెట్టాలి.

**అన్నీ కదలిపోయే మేఘాలే-ఆత్మ మాత్రమే నిశ్చలం**

ధ్యానమని చెప్పారు. ఏమిటీ ధ్యానమనేది? ఒక్క దైవత్వాన్ని మాత్రమే దృష్టియందుంచుకోవడం. దీనిని అనేక విధములుగా కూడను సాధనలు సలుపుతూ వచ్చారు. అరవింద్‌ఘోష్, రమణ మహర్షి రాత్రివేళ మిద్దెపైన కూర్చోవడము, ఒక స్టార్‌పై దృష్టి పెట్టటము. ఏ స్టార్? సినిమా స్టార్ కాదు, చుక్కలు చూచేవారు. ఒక్క చుక్కపై దృష్టిని ఉంచుకున్నారు. అట్లనే అభివృద్ధి చేస్తూ పోయారు. కళ్ళు మూసినా కూడను అయొక్క దృష్టియే కనిపిస్తూ ఉండాలి. కనుక సమ్యక్‌దృష్టి అనగా ఏమిటి? పవిత్రమైన దానినే చూడాలి. రోడ్డుపైన ఎంతమందో నడచుకుంటూ పోతుంటారు. ఈ చెత్తను చూడడానికి కాదు నీకు కళ్ళనిచ్చింది. నీవు దారిని నడుస్తున్నావు దారిపై నీ దృష్టిని పెట్టుకో. నీవు వీరిని వారిని చూచుకుంటూ పోతుంటే, నీకు ఏక్సిడెంట్ అవుతుంది. కనుక నీవు నడిచే

srisathyasaivachanamrutam

సమయంలోపల దారిని చూచుకుంటూ నడు. అదే మీ పవిత్ర దృష్టి. Help ever, hurt never. ఇవి ప్రమాదము కాకుండా కూడ ఉంటుంది. కనుక నీవు ఏదైనా ఒక ప్రమాదమునకు గురికాకుండా, పరులను నొప్పించకుండా నీవు తప్పించుకొని తిరిగేటివంటి పవిత్రమైన దైవచింతనపై దృష్టి పెట్టు. ఏ పని చేసినప్పటికిని, ఇది దైవ కార్యముగానే భావించు. ఒక పిచ్చివానికి అన్నము పెడుతున్నావు. ఇదికూడ నీవు భగవంతునికి నైవేద్యం ఇస్తున్నావనుకో. కనుక ఏ పని చేసినప్పటికిని భగవత్ప్రీత్యర్థం చేయాలి. నీ త్యాగమే నిజమైనట్టి యోగము. దేహమునకు త్యాగాలు లేకుండా భోగాలు అందిస్తుంటే, అదొక రోగాలపుట్ట అయిపోతుంది. కనుకనే వేదం 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః'. ఈ పొజిషన్, యీ అథారిటీ ఎంతవరకు ఉంటాయి. ఇవన్నీ కదలిపోయే మేఘములే. ఒక్కటి కూడను పర్మనెంట్‌గా ఉండదు. దేహము కాని, విషయము కాని, మేటర్‌కాని అన్నికూడ కదలిపోయేటువంటివే. కాని కదలనిది, మెదలనిది, జారనిది, ఊడనిది ఒక్క ఆత్మతత్త్వమే.

**నిరంతరం సత్సంగము చేయాలి**

కనుక నీవు మొట్టమొదట సమ్యక్‌దృష్టి పెంచుకో, తక్షణమే సమ్యక్‌వాక్. ఈ వాక్కును మనమేవిధంగా ఉపయోగపెట్టాలి? ఏదైనా మందిలో ఉన్నామని పనికిమాలిన మాటలు అన్నీ మాట్లాడుకుంటూ కూర్చోవద్దు. ఏదైనా దైవత్వంతో స్మరించేటట్టి మాటలనే మనం మాట్లాడాలి. దీనిలో ఒక సంసార విషయమో, ఇంకో సంసార విషయమో, ఇంకొకరి పరిస్థితి విషయమో మనమేమాత్రము ఉచ్చరించకూడదు. కనుక ఎప్పుడు చూచినా గాని యితరుల చింతన వల్లనే మన కాలమంతా వ్యర్థం చేస్తున్నాము. ఇతరుల చింతనవల్ల నీ కొచ్చిన ఫలితమేమిటి? నీకు కూడను అశాంతి బయలుదేరుతుంది. నీ హృదయం కూడ మాలిన్య మవుతుంది. ఏ ఒక్క దృష్టితో మనము పెట్టుకుంటున్నామో, ఆ దృష్టినే అన్నాళ్ళు మన హృదయంలో ప్రింటయిపోతాయి. కనుకనే యితరులయొక్క మాటలకు మనము ఏ మాత్రము అవకాశమివ్వకూడదు. ఇతరులకు సహాయపడేటి వాక్యములు పెట్టుకో. ఇతరులకు పనికొచ్చేటువంటి సేవ చేయుటకు పలుకులు ఉపయోగించుకో అంతే కాని, యితరులయొక్క దోషములు, ఇతరులయొక్క తప్పులు, ఇతరులయొక్క పాపములు



srisathyasaivachanamrutam

నీవేమాత్రము చింతించవద్దు. కనుకనే నీయొక్క మాట్లాడేటువంటి వాక్కులు హృదయానికి సంబంధించినట్టివిగా ఉండాలి. సమ్యక్‌దృష్టి తర్వాత సమ్యక్‌వాక్. తర్వాత సమ్యక్‌శ్రవణము.

**చిత్తాన్ని నవవిధ భక్తులలో ప్రవేశపెట్టాలి**

మన చెవులు వింటున్నాయి. యిప్పుడు, ఎప్పుడు చూచినాకాని మనము యితరుల చింతన మాత్రమే వింటున్నాము. ఒక భగవత్ ధ్యాసగాని, భగవత్ చింతనకు, ఏ విధమైన దీంట్లో కూడ మన మనస్సును ప్రవేశపెట్టడం లేదు. కనుకనే నవవిధమార్గములోపల దీనిని ప్రవేశపెట్టు. ఏమిటవి? శ్రవణం, కీర్తనం, విష్ణుస్మరణం, పాదసేవనం, వందనం, అర్చనం, దాస్యం, స్నేహం, ఆత్మనివేదనము. ఈ నవవిధమార్గములలోపల ఒక భక్తి మార్గంలోనైనా నీవు ప్రవేశించు. ఇది మనయొక్క శ్రవణము ఒక్క తత్త్వము. అంతేకాదు, ఇతరుల యొక్క కష్టములు, ఇతరులయొక్క నష్టములు, ఇతరులయొక్క బాధలు మనము ఏమాత్రము కూడ శ్రవణము చేయకూడదు. తోటివారు బాధపడేటట్టివి నీవు చూస్తివా, వారికి ప్రేమతో సహాయము చేయి, తప్పులేదు. అంతేగాని వారి చింతనంతా మన హృదయంలో చేర్చుకోవద్దు. హృదయం చాలా సూక్ష్మమైనట్టిది. ఏది మాట్లాడుతామో, ఏది చూస్తామో, ఏది వింటామో, అవన్నీ హృదయంలో ప్రింటయి పోతుంటాయి. ఈ ప్రింటయిపోయిన విషయమంతా మధ్య మధ్యన మనకు రికార్డువలే వినిపిస్తుంటాది. కనుక మన హృదయంలో ఈ చెడ్డ విషయానికి ఏమాత్రము కూడ అవకాశము ఇవ్వకూడదు.

**హృదయంలో సరియైన మార్పు రావడమే కొత్త సంవత్సరం**

కనుకనే ముఖ్యంగా యీనాడు తెలుసుకోవలసిన విషయం న్యూ ఇయర్, కొత్త సంవత్సరము, విశు అని. మనం తెలుసుకోవలసినది ఎన్ని కోట్ల సంవత్సరములు వచ్చినాయి? ఎన్నో విశులు వచ్చినాయి, పోయినాయి. మన హృదయం ఏమాత్రం మారింది? ఇన్ని విశులు మనం జరుపుకున్నప్పటికినీ, ఎన్ని కొత్త సంవత్సరములు పోయినప్పటికిని, మన హృదయం ఉన్న స్థానంయందే ఉంటున్నది. కనుక నీవు మొట్టమొదట ప్రతీ విశుకూడ ప్రతీ న్యూ ఇయర్ మన హృదయాన్ని పవిత్రముగా



sri sathyasaivachanamrutam

మార్చుకోవాలి. అట్లు లేకుండా ఏదో విశు వచ్చిందని స్వీట్లు చేసుకొని తినడమో. ఒక కొత్త సంవత్సరము స్వీట్లు చేసుకుని, తినటానికి మాత్రమే మనము కొత్త సంవత్సరాన్ని ఉపయోగించుకోకూడదు. ఏమిటి? ఆనందమనేది ఎప్పటికీ ఉండాలి. దీనికి విశు రానక్కరలేదు. కొత్త సంవత్సరము రానక్కరలేదు. నిత్యము మనం భుజిస్తూనే ఉన్నాము. ఇది భుజించడం కోసం కొత్త సంవత్సరము. నీ హృదయములోపల కొత్త భావము ఆవిర్భవించినప్పుడు కొత్త సంవత్సరముయొక్క ఆహారం భుజించాలి.

నిద్దురనుండి లేచి మరి నిద్దురపోయే దాక పొట్టకై హద్దు పద్దు లేక అనుభవించుచు, నీవు సాధించినదేమి? తెల్లవారు లేచినమొదలు రాత్రి పరుండువరకు భుజిస్తున్నావు. ఇదా జీవితముయొక్క లక్ష్యము? what is the purpose of life? 'ఖానా, పీనా, సోనా, మర్‌నా' ఇది కాదు. మనం వచ్చిన పని వేరే ఉంది. ఇంద్రియములను కూడ అరికట్టుకోవాలి. ఐహికములు పవిత్రమార్గములో ప్రవేశపెట్టాలి. దాని నిమిత్తమై మీకు ఐహికములు యిచ్చాడు. ఈ చూచినటువంటి నేత్రములు ఎంత చిన్నవి, చెప్పండి హాఫ్‌యించికూడా లేదు. హాఫ్‌యించి అయినా లేని యీ నేత్రములచేత కోట్లమైళ్ళ దూరములోని నక్షత్రాలను చూడగలుగుతున్నావు. ఈ చిన్న నేత్రములకు యీ శక్తి ఎక్కడనుంచి వచ్చింది. అదియే భగవత్ శక్తి.

**భగవంతుడు ఎప్పుడూ నీతోనే ఉన్నాడని గుర్తించు**

ఒక టార్చిలైటు వుంది. అందులో కొత్త స్విచ్, కొత్త బల్బు ఇవన్నీ ఉన్నా లైటు వస్తుందా? రాదు, కారణమేమిటి? కొత్త బ్యాటరీలు వేయాలి. బ్యాటరీలు వేసినప్పుడు లైటు వస్తుంది. కాబట్టి మనయొక్క దేహము కొత్త టార్చి. కాని, కళ్ళు కొత్త బల్బే. మన బుద్ధి కొత్త స్విచ్. కానీ కొత్త ఆలోచనలు అనే బ్యాటరీలు లేవు. ఈ కొత్త ఆలోచనలు అనే బ్యాటరీలే కొత్త సంవత్సరములు, విశు అనే పవిత్రమైనట్టి భావాలనే దానితో నీ హృదయం నింపుకో. అప్పుడు వేస్తే చాలు ప్రకాశము వస్తుంది. టార్చ్ అనే దేహము ఉన్నంతవరకు నీవెంట పట్టుకొని పో, అదియే భగవంతుడు. ఎప్పుడూ God is in you, with you, above you, below you, around you. కనుక భగవత్తత్త్వమనేటువంటిది మన వెంటనే, జంటనే,

srisathyasaivachanamrutam

యింటనే, కంటనే ఉంటున్నాది. భగవంతుని వదలి ఒక్క క్షణమైనా నీవు ఉండడానికి వీలులేదు. నీవే భగవత్స్వరూపము. ఆ తత్వాన్ని నీవు పెట్టుకో. అప్పుడు నీలో చెడ్డభావాలకు అవకాశముండదు.

**పశుత్వం తొలగించుకుంటే మానవత్వం సార్థకమవుతుంది**

నీవు మనిషి అనడానికి ఏది మూలకారణము? నేను మనిషి, మనిషి, మనిషి అనేది సగం నిజం మాత్రమే. రెండవ సగం నిజం ఏమిటి? నేను పశువును కాను, నేను పశువును కాను, నేను పశువును కాను. ఈ రెండింటినీ చేర్చినప్పుడే పూర్తి మానవునిగా తయారవుతావు. కాని యీనాడు మానవుడను అనుకుంటున్నాడు. కాని పశువుగా ప్రవర్తిస్తున్నాడు. కనుక నీవు మానవుడనుకు న్నప్పుడు, పశువుగా మారకుండినప్పుడే చెడ్డ భావము, చెడ్డ తలంపులు ప్రవేశించవు. ఈ రెండింటియొక్క చేరికనే దివ్యత్వంగా మారిపోతుంది. కనుక దివ్యత్వమే నీయొక్క తత్త్వము. దివ్యత్వమే నీయొక్క నిజస్వరూపము. నీయొక్క పవిత్రమైన తలంపులే యీ కర్మలకు మూలము. ప్రపంచమంతయూ ధర్మక్షేత్రము. ఈ ధర్మక్షేత్రానికి యాత్రికునిగా వచ్చావు నీవు. కనుక యీ యాత్రను సక్రమము చేసుకుంటూ సఫలం చేసుకుంటూ వెళ్ళు. అందువల్ల నీవు యీ పవిత్రమైన సమ్యక్‌దృష్టి, సమ్యక్‌వాక్కు, సమ్యక్‌శ్రవణము, సమ్యక్‌భావము, సమ్యక్‌కర్మ చేయాలి. కనుక ప్రతి మానవుడు పవిత్రమైన దృష్టిని అభివృద్ధి చేసుకోవాలి. ఆ దృష్టివల్లనే పవిత్రమైన భావాలు మనలో ఏర్పడతాయి. ఈనాటి ప్రతి మానవునకు చెడ్డదృష్టి, చెడ్డదృష్టి, చెడ్డదృష్టి. ఎక్కడ చూచినా చెడ్డ తలంపే, ఎవరిని చూచినా చెడ్డ మాటలే. ఇలాంటి మానవుడు ఏవిధంగా దైవత్వాన్ని పొందడానికి వీలవుతుంది? కనుక యిది కాదు మనయొక్క మార్గము. ఈ దృష్టిని మనం అరికట్టుకోవాలి.

**(తేదీ 14-04-1998న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam